

# పరదేశీ కథలు

## – లలిత చిట్టె



### "సీత" కథ

### -44-

"**సీత మనింటికి** వచ్చి రెండేళ్ళు గడిచాయి. ఈ రెండేళ్ళు మనింట్లో వుండి మన బిడ్డల్ని చాలా చక్కగా చూసుకుంది. జీతం కోసం పనిచేసే పనిమనిషిలా కాకుండా బాధ్యతగా, ప్రేమతో పిల్లల బాగోగులు చూడటం వల్ల, మన పిల్లలు కూడా సీతను ఎంతో అభిమానిస్తున్నారు. సీత సంరక్షణలో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతూ బాగా చదువుకుంటున్నారు. సీతను వాళ్ళు చాలా ఇష్టపడుతున్నారు. వారి సంతోషం కన్నా మనకు వేరే ఏం కావాలి? అందుకే సీతను మనం బాగా చూసుకోవాలి. ఆమె రెండేళ్ళ అక్కామా(వీసా) గడువు కూడా అయిపోయింది. తిరిగి మరో రెండేళ్ళకు అక్కామా వేయిస్తాను. అలాగే ఇండియా వెళ్ళి రావాలనుకుంటుందేమో కనుక్కో, రెండేళ్ళకు ఒకసారి రెండు నెలల శెలవలు, ఫ్లయిట్ టిక్కెట్లు మనం ఇవ్వాలి కదా?" హాల్లో కూర్చుని "గహ్వా" (అరబిక్ కాఫీ) త్రాగుతూ అన్నాడు బాబా.

"నిజమే. సీతలాంటి మంచి మనిషి దొరకడం కష్టం. ముందుకూడా పనికిమాలినవాళ్ళు ఇద్దరు వచ్చి, పని సరిగ్గా చేయకపోతే వారిని తిరిగి ఏజంటు దగ్గరకి పంపేశాం. వారి కోసం చాలా డబ్బు ఖర్చుపెట్టి నష్టపోయాం మన అదృష్టం కొద్దీ సీత మనకు దొరికింది. నమ్మకంగా పనిచేస్తోంది. ముఖ్యంగా పిల్లల్ని బాగా చూసుకుంటోంది. సీతమీద నమ్మకంతో ఆఫీసుకెళ్ళినా నేను పిల్లల గురించి ఎక్కువగా ఆలోచించకుండా నిశ్చింతగా వుంటున్నాను. ఇలాంటి మనిషికి జీతం ఎక్కువ ఇచ్చినా నష్టమేమీ లేదు. అక్కామా మరో రెండేళ్ళు వేయించి జీతం ఇంకో ఇరవై దినార్లు పెంచండి. రెండునెలలు ఇంటికి వెళ్ళి వస్తుందేమో నేను కనుక్కుంటాను."

"మరి సీత ఇక్కడ లేని రెండునెలల కాలం పిల్లల్ని చూసుకోవడం నాకు కష్టమైపోతుంది. కాబట్టి ఆ ఏజంటుకు ఫోన్ చేసి రెండు నెలల కాలానికి ఎవరైనా పార్ట్ టైమ్ పనిమనిషిని పంపిస్తాడేమో కనుక్కోవాలి" అంది మామా. సీత లేకుండా పిల్లల్ని ఎలా చూసుకోవాలా అనే దిగులు ఆమె మాటల్లో కనిపిస్తోంది.

చిన్నపిల్లవాడైన అబ్దుల్లాకు బాటిల్ పాలు పడుతున్న సీత దగ్గరికి వెళ్ళింది మామా. "సీతా ఈ రెండేళ్ళు మా యింట్లో నీవు బాగా పనిచేసావు. బాబా కూడా నిన్ను మెచ్చుకున్నారు. నువు వచ్చినప్పటినుండీ పిల్లలు నీతో కలిసిపోయి చాలా సంతోషంగా వున్నారు. చంటి పిల్లవాడు అబ్దుల్లా అయితే నిన్ను విడిచి వుండలేకపోతున్నాడు. ఇంతగా పిల్లలు నీకు అలవాటు అయ్యారు. అందుకే మరో రెండేళ్ళకు నీకు అక్కామా వేయించి, నీ కష్టానికి తగినట్లుగా ఇంకో ఇరవై దినార్లు జీతం పెంచాలి అనుకుంటున్నాం. మరి రెండేళ్ళ తరువాత నీకు ఇండియా వెళ్ళి రావడానికి శెలవలు, ఫ్లయిట్ టిక్కెట్లు మేము ఇవ్వాలి. అందరూ అలాగే ఇంటికి వెళ్ళి ఇంట్లో సంతోషంగా గడిపి

వస్తారు. మరి నువు కూడా ఎపుడు వెళ్ళాలనుకుంటున్నావో చెబితే ఆ తేదీకి మీ బాబా నీకు ఫ్లయిట్ టిక్కెట్లు కొని తెస్తారు. నువు వెళ్ళి వచ్చే రెండు నెలలూ పిల్లల్ని ఎలా సముదాయించాలా అని నేను ఆలోచిస్తున్నాను. ఎందుకంటే పిల్లలు నిన్ను బాగా ఇష్టపడుతున్నారు. బాగా అలవాటు అయ్యారు. అయినా తప్పదు కదా! నువు కూడా నీ దేశం వెళ్ళి నీ వాళ్ళను చూసి రావాలి కదా!'' అంది మామా.

మామా మాటలు విని ఒక్క క్షణం ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయింది సీత. తరువాత ఏదో నిర్ణయానికి వచ్చినట్లు నీళ్ళు నిండిన కళ్ళతో, రెండు చేతులూ జోడించి ''లేదు మామా నేను వెళ్ళను. ఇంకో పదేళ్ళయినా సరే నాకు ఇంటికి వెళ్ళాలని లేదు. ఎందుకంటే అక్కడ నన్ను ప్రేమించేవాళ్ళు ఎవరూ లేరు. మీ ముగ్గురు పిల్లలూ నన్ను చాలా ఇష్టపడుతున్నారు. వీరి ఆలనా పాలనతో నాకు కాలం సంతోషంగా గడిచిపోతోంది. నాకు పిల్లలు లేరనే కొరత ఈ విధంగా తీరిపోయింది. ఇంతగా నన్ను ఇష్టపడి అలవాటయిపోయిన ఈ చిన్న పిల్లల్ని విడిచి రెండు నెలలు కాదుకదా, రెండు రోజులు కూడా నేను వుండలేను. అయినా అన్ని రోజులు నేను లేకపోతే పిల్లలు నాకోసం బెంగపెట్టుకుంటారు. దయచేసి నన్ను మీ దగ్గరే వుండనివ్వండి. నాకోసం ఆలోచించని ప్రేమించని మనుష్యుల దగ్గరికి వెళ్ళాలని లేదు'' అంది సీత బాధగా.

సీత మాటలకి ఆశ్చర్యపోయింది మామా. ''ఏంటి సీతా నీ దేశంలోని నీ యింటికి వెళ్ళాలంటే అంత బాధ ఎందుకు? ఎందుకా కన్నీళ్ళు? ఏంటి నీ కథ? అక్కడ నీకు ఎవరూ లేరా?'' భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా అడిగింది మామా.

''అందరూ వున్నా ఎవరూ లేనట్లే మామా మానవ సంబంధాలన్నీ స్వార్థపూరితాలే. చివరకు కన్నతల్లిదండ్రులు కూడా స్వార్థంగా ప్రవర్తించడంతో, ఆవేదన చెంది వారికందరికీ దూరంగా, ఇక్కడికి, మీ దగ్గరికి నేను రావలసి వచ్చింది'' అంది సీత.

''ఏంటి సంగతి ఏమయింది? నీ గురించి వివరంగా చెప్పు'' అంది మామ ఆ ప్రక్కనే వున్న కుర్చీని దగ్గరికి లాక్కుని కూర్చుంటూ.

ఎందుకో మనసంతా గుబులుగా వుంది సీతకు. మధ్యాహ్నం నుండీ ఆ ఆసుపత్రిలో మూలన వున్న ఒక కుర్చీలో కూర్చుని ఆలోచన చేస్తోంది సీత. ప్రొద్దున్నే లేచి భర్త సురేష్‌తో కలిసి మొదటి బస్‌కు బయల్దేరి తిరుపతి ఆసుపత్రికి వచ్చారు. వనజాక్షికి నాలుగేళ్ళు బిడ్డలు పుట్టకపోతే ఈ డాక్టరుకాడికి వచ్చి చూపించుకున్నాకే గర్భం నిలబడిందంట. మంచి మగపిల్లోడు పుట్టినాడట. అందుకే అత్తగారు నెలరోజుల్నించీ ''ఆ ఆసుపత్రికి పోయి చూపించుకోండి. డాక్టరు చేయి మంచిదంట. ఇప్పటికి మన ఊర్లో బిడ్డలు లేనివాళ్ళు నలుగురు ఆయన దగ్గరికి పోతే బిడ్డలు పుట్టినారు. పోతే పోయింది ఐదువేలు, ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరి కాళ్ళు పట్టుకుని రెండు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి ఇస్తా. మీరు ఆసుపత్రికి పోయిరండి, దేవుడు దయతలచి వచ్చే సంవత్సరానికల్లా నాకొక మనవడు పుడితే అంతే చాలు. వెంటనే కాలిదోవన తిరుపతి కొండకు పోయి ఆ ఏడుకొండల వాడికి నా తల వెంట్రుకలు ఇచ్చి వస్తాను. '' అని ఒహటే గొడవ చేస్తావుంటే.. తిరుపతి ఆసుపత్రికి వచ్చారు. రక్త పరీక్షలు మూత్రపరీక్షలు చేసారు. ఎక్సరేలు స్కానింగ్‌లు తీసినారు. ఆ రిపోర్టులన్నీ సాయంత్రం ఇస్తారంట. డాక్టరు కూడా మధ్యాహ్నం భోజనానికి వెళ్ళి మరలా తిరిగి సాయంత్రం ఆరుగంటలకి వస్తారంట. మరి అంతవరకూ ఇక్కడ కూచుని కాలం గడపాల్సిందే సురేష్ బయటికి వెళ్ళి వీధికి ఎదురుగా వున్న టిఫిన్ సెంటర్‌లో నాలుగు ఇడ్లీలు తిని మరో నాలుగు పొట్లం కట్టుకుని తీసుకుని వచ్చాడు. సీత ఆ నాలుగు ఇడ్లీలు తిని నీళ్ళు త్రాగింది.

రిపోర్టులు వచ్చాక డాక్టరు ఏం చెబుతాడో, ఏమో అని ఆమెకు కాస్త భయంగా వుంది. పెళ్ళయి మూడేళ్ళు దాటి నాలుగో సంవత్సరం వచ్చింది. తనతోపాటు పెళ్ళయిన ఎగవీధిలో ఉండే కుమారికి ఒక పిల్లోడు పుట్టి మరలా పురిటికి అమ్మగారింటికి వెళ్ళింది. చిన్నత్త కోడలికి పాపపుట్టి రెండేళ్ళు దాటింది. ఇపుడు మరలా ఆరోనెల గర్భవతి. ఇవన్నీ చూస్తున్న అత్తగారు సుబ్బలక్ష్మమ్మ సంవత్సరం ముందు నుంచీ సణుగుడు మొదలు పెట్టింది. సాయంత్రం పొలం నుంచి వచ్చాక ఆమె తీరుబడిగా వీధిలో అరుగుమీద కూర్చుంటుంది.

వక్కాకు సంచి విప్పి, తమలపాకులకు సున్నం రాసుకుంటూ ఎదురింటి రాములమ్మ పిన్నిని, ప్రక్కింటి శేషవ్వను ఇంకా దారిని పోయేవోళ్ళను పిలుస్తుంటుంది. ఊసుపోని కబుర్లన్నీ మాట్లాడుకుంటూ మధ్యలో, తన కోడలు నీళ్ళు ఇంకా పోసుకోలేదనీ, అందరి కోడళ్ళూ రెండోసారి కూడా పిల్లల్ని కనేస్తున్నారనీ, ఎన్ని దేవుళ్ళకి మ్రొక్కినా ఫలితం కనబడలేదనీ వాపోతుంటుంది. ఊర్లో అందరు అత్తలూ కొడుకులకు పెళ్ళిళ్ళు చేసి సంవత్సరం తిరక్కముందే మనవళ్ళను చంకన బెట్టుకుని తిరుగుతుంటే తనకు ఇంకా ఆ ప్రాప్తం లేదనీ చెప్పినమాటే ప్రతిరోజూ చెప్పి కోడలిని ఈసడిస్తూ వుంటుంది. అమ్మలక్కలు కూడా గమ్మునుంటారా సమయం దొరికింది కదా అని వాళ్ళ నోటికొచ్చినట్లు తలో మాట చెప్పి అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఆమె కడుపు మంటను ఎక్కువ చేస్తుంటారు. ఆమె అవన్నీ తెచ్చి కోడలిమీద తన అయిష్టతను కోపాన్ని ద్వేషాన్ని వెళ్ళగక్కుతుంటుంది.

అత్తగారి ఈసడింపులు విన్నప్పుడల్లా అంతులేని బాధతో కుమిలిపోయేది సీత. తనకు పిల్లలు ఇంకా ఎందుకు పుట్టలేదో అని లోలోపల మధనపడేది. శృతిమించిన అత్తగారి సాధింపులకు జవాబు ఏం చెప్పాలో అర్థంకాక, ఇంటికోడలిగా ఎదురుగా మాట్లాడే ధైర్యమూ చేయలేక తనలో తానే ఏడ్చుకునేది సీత. భర్తకన్నా చెప్పుకుని ఊరట పొందుదాం అనుకుంటే ఆమెకు తోడు సురేష్ కూడా సూటిపోటిమాటలతో హింసిస్తుంటాడు.

"గట్టు కింద పల్లెలో రాజేశ్వరి అనే పిల్ల తెల్లగా భలేవుంది. కట్నం కూడా రెండు లక్షలు ఇస్తాం అన్నారు. ఆ పిల్లకు కొంచెం పళ్ళు ఎత్తుగా వున్నాయని మా అమ్మ వద్దురా అనింది. ఆ పిల్లను చేసుకొని వున్నా ఈ పాటికి ఇద్దరు బిడ్డల తండ్రిని అయివుండేవాడిని. చిన్నారం పాడులో ఒక పిల్లను చూసాం. చేసుకోమని వాళ్ళు బంగపడినారు. చదువు కూడా ఇంటర్ దాకా సదివింది. ఒక్కటే పిల్ల. ఉన్న ఇల్లు ఆస్తులూ అన్నీ అల్లుడికే. అందుకే మాయమ్మ మంచి ఆస్తులురా అన్నీ మనకే వస్తాయి చేసుకో అని మా అమ్మ పోరుపెట్టింది. కానీ ఆ పిల్ల కాకి నలుపు. పుట్టేపిల్లోళ్ళు క్రరిగా పుడతారు ఆ పిల్ల నాకొద్దు అంటిని. ఆ పిల్ల మొన్నా మధ్య కోడూరు బస్టాండ్‌లో కనబడింది. సంకలో తెల్లటి పిల్లోడ్ని బెట్టుకుని పోతావుంది. ఆ పిల్లను చేసుకుని వున్నా బాగుండేది. ఆస్తిని అనుభవించే అదృష్టం లేకపాయె -

'ఈ పిల్ల వద్దురా లక్షరూపాయలు కూడా ఇచ్చేట్టుగా లేరు. పేదోళ్ళుగాని, ఏం పెడతారు కొంచెం పెట్టేకాడ చేసుకోరా బాగుపడతావు. ఊర్లో కూడా గౌరవంగా వుంటాది' అని మాయమ్మ ఎంతజెప్పినా వినకుండా నువు ఎర్రగా బుర్రగా వున్నావని పట్టుబట్టి నిన్ను చేసుకున్నానని ఏం పెట్టినాడు మీ నాయన? యాభైవేలు లెక్క చేతికిచ్చి నీకు ఐదు తులాల బంగారం పెట్టి ఇదిగో ఇంకో ఆడపిల్ల ఎదిగి ఇంట్లో వుండాది. దాని సంగతి కూడా మేము చూడాలి కదా అని కల్లబొల్లి మాటలు చెప్పి నిన్ను కట్టబెట్టినాడు. పోనీలే పిల్ల బాగుంది చూసేదానికి అందరిలో అందంగానూ ఊరిలో గొప్పగానూ వుంటాది అని పెద్దగా పెట్టక పోయినా నిన్ను చేసుకున్నాను. నాతోపాటు పెళ్ళయిన నాతోటి కుర్రాళ్ళకి అందరికీ ఎప్పుడో పిల్లోళ్ళు పుట్టి నాయనా అని పిలుస్తాండారు. పుట్టిన పిల్లోళ్ళను మెడలమీద ఎక్కించుకుని వీధుల్లో గొప్పగా తిరుగతాండారు. తమ మగతనాన్ని నిరూపించుకున్నందుకు విర్రవీగుతూ రొమ్ము విరుచుకుంటున్నారు. నీయమ్మ గొడ్డుదానా.. నా రాత బాగలేక నిన్ను చేసుకుని నేను దేనికీ పనికిరాకుండా పోతినే. వీధుల్లో సిగ్గుపడతా తిరగాల్సి వచ్చేనే. మగోడు పెళ్ళి చేసుకునేది ఎందుకు? కొడుకును కని వంశాన్ని, ఇంటి పేరును నిలబెట్టాలనే కదా! పిల్లోళ్ళు పుట్టకపోతే ఆ పెళ్ళి ఎందుకు? దాన్ని పటంగట్టి గోడకు వేలాడదీసుకోనా? బయటికి పోవాలంటే నాకు సిగ్గుగా వుండాది. నాతోటి కుర్రగాళ్ళు అందరూ నన్ను జూసి నవ్వుతుండారు. ఛీ ఎందుకీ బ్రతుకు? ఎండ్రిను త్రాగి చస్తే బాగుంటాది" అంటూ ఇంకా రకరకాలుగా అనరాని మాటలన్నీ నోటికొచ్చినట్లు సులభంగా అనేసి సీతను క్రుంగదీసేవాడు. మాటలా ఇవి గుండెల్లో దించిన గునపాలా అనిపించి ఏడ్చుకునేది సీత.

బిడ్డలు పుట్టకపోవడం తన తప్పు అయినట్లుగా వాళ్ళు సాధించడం, మాటలతో వేధించడం ఎంతో ఆవేదనకు గురిచేసేది. దేవుడా దయతలచి నాకొక్క బిడ్డనివ్వు అంటూ అన్ని దేవుళ్ళకూ మొక్కుకునేది సీత. అత్తగారైతే అస్తమానం అన్ని గుళ్ళకూ తీసుకెళ్ళేది.

అత్తగారు చెప్పినట్లు తడి బట్టలతో, ఉపవాసాలతో పూజలు, వ్రతాలు చేసి అలసిపోయింది సీత దీనికి తోడు ఆడపడుచు రాజికి ముగ్గురూ కొడుకులే పుట్టారు. సీత పెళ్ళయినప్పటినుండీ ఇప్పటికి రెండుసార్లు పుట్టింటికి వచ్చి మగపిల్లల్ని కని గర్వంగా పిల్లోడ్ని సంకలో బెట్టుకుని వెళ్ళిపోయేది. వెళుతూ వెళుతూ మగ పిల్లోళ్ళను కంటున్నందుకు మురిసిపోతూ సీతవైపు చూసి "వదినా నీ అందం తరిగిపోతుందని పిల్లోళ్ళు పుట్టకుండా మందులు మింగుతున్నావా ఏంటి? స్త్రీకి పిల్లల్ని కనడం దేవుడిచ్చిన వరం. మాతృత్వం అనేది ఎంతో మధురమైనది. పిల్లలు లేకపోతే స్త్రీ బ్రతుకు వ్యర్థం తెలుసుకో. నీ తోటి వాళ్ళందరూ రెండోసారి కంటున్నారు. తొందరగా నువు కూడా ఒక కొడుకుని కని మా యింటి పేరును నిలబెట్టలేకపోతే మా అన్నకు ఇంకో పెళ్ళి చేయాల్సివుంటుంది. జాగ్రత్త" అంటూ బెదిరిస్తుంది. అదేదో అంతా సీత చేతిలో వున్నట్లు మీట నొక్కితే పిల్లలు పుట్టేటట్లు, అలా నొక్కకపోవడం సీత తప్పయినట్లుగా హేళన చేసేది ఆడపడుచు. దేవుడా నన్నెందుకు పుట్టించావు? పుట్టించి ఇలా ఎందుకు హింసిస్తున్నావు అని దేవుడ్ని ప్రార్థిస్తూ, ప్రశ్నిస్తూ కుమిలిపోయేది సీత. రోజులు గడిచేకొద్దీ అన్నివైపుల నుండి వత్తిడి ఎక్కువైంది సీతకు.

ఇప్పుడు ఈ ఆసుపత్రిలో రిపోర్ట్సు వచ్చాక డాక్టరు ఏమని చెపుతాడో అని భయంగావుంది. ఏవైనా మందులు ఇచ్చి కొన్ని రోజులు వాడండి ఫలితం వుంటాది అని చెబితే బాగుంటుంది. పిల్లలు లేకపోవడం తనకు కూడా సిగ్గుగానూ, అవమానంగానూ వుంది. ఆలోచనలు ఎంతకీ తెగడం లేదు.

ఇంతలో అటెండరు వచ్చి డాక్టరుగారు పిలుస్తున్నారు అని చెప్పడంతో ఇద్దరూ లోపలికి వెళ్ళారు. డాక్టరు ఇద్దరివైపు చూసి "మీ పెద్దవాళ్ళెవరూ రాలేదా?" అని అడిగాడు.

"లేదు డాక్టర్" అన్నారిద్దరూ ఒకేసారి.

"ముఖ్యమైన విషయం చెప్పాలి పెద్దవాళ్ళకు చెబితే బాగుంటుంది. సరే ఫరవాలేదు. మీరు ఎవరి బిడ్డనైనా తెచ్చి పెంచుకోండి. మీకు పిల్లలు పుట్టే యోగ్యత లేదు" అన్నాడు డాక్టరు.

"ఎందుకు డాక్టర్? మాతో ఎవరికైనా ప్రాబ్లెమ్ వుందా?" అని సురేష్ అడిగితే ఆయన

"ఎవరికుంటే ఏం? మీరు తల్లిదండ్రులులేని బిడ్డని దత్తత చేసుకోండి బాగుంటుంది" అని తేల్చేశారాయన. ఇంకేం అడగలేక ఉసూరుమంటూ ఆఖరి బస్ ఎక్కి ఇంటికి తిరిగి వచ్చారు ఇద్దరూ.

డాక్టరు చెప్పిన జవాబుతో అత్తగారు తృప్తిపడలేదు. రాత్రంతా అత్త, మామ, కొడుకు తర్జన భర్జనలతో కాలం గడిపి, మరలా ప్రొద్దుటే లేచి ముగ్గురూ ఆసుపత్రికి వెళ్ళిపోయారు. వాళ్ళు తిరిగి వచ్చేవరకూ ఇంట్లోకి, బయటికి తిరుగుతూ ఊర్లోకి వచ్చే ఎర్రబస్సు కోసం ఎదురు చూస్తూ కంగారుగా కాలం గడిపింది సీత.

రాత్రి పదిగంటలకు ఆఖరి బస్ దిగి నీరసంగా ఇంట్లోకి వచ్చారు ముగ్గురు. ఎందుకో వారి ముఖాలు చూడాలంటేనే భయం కలిగింది సీతకు. పిల్లలు కలగకపోతే తన పరిస్థితి ఏమిటి? వీళ్ళ మాటలు వింటూ ఎన్నాళ్ళు జీవించగలదు? వీళ్ళ సాధింపులు భరిస్తూ ఎన్నేళ్ళు కాపురం చెయ్యగలదు. అసంభవం. అంతకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకుని అందులోకి దూకి చావడం మంచిదేమో. ముగ్గురు మౌనంగా భోంచేసారు. పడకలు బయట వేయమని చెప్పి ముగ్గురూ బయటచేరి మంతనాలు ప్రారంభించారు. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలని కాస్త తాపత్రయపడింది. కానీ వాళ్ళు ఆమెను లోపలే వుండమని చెప్పడంతో రూములోనే పడుకుండిపోయింది. ఎపుడో మధ్య రాత్రిలో మంతనాలు ముగించిన మొగుడు రూములోకి వచ్చి 'సీతా సీతా' అంటూ సీతను నిద్రలేపాడు. ఆమె నిద్రపోతే కదా లేవడానికి. ఆ పరిస్థితిలో ఎలా నిద్రపడుతుంది?

"సీతా నీకు పిల్లలు పుట్టే యోగ్యత లేదని రిపోర్టులలో తేలింది. డాక్టరు చేత ఆ విషయం బయటకి చెప్పించడం కోసం ఈ రోజంతా అక్కడ పడిగాపులు కాసాం. ఆయన చెప్పకపోతే మా మేనమామ భార్య తమ్ముడు అక్కడే డాక్టరుగా చేస్తుంటే వెళ్ళి వాళ్ళను పట్టుకుని రిపోర్టులు చూపించి నిజం బయటకి చెప్పించాల్సి వచ్చింది. లోపం నీలోనే వుందంట. మరేం చేద్దాం చెప్పు. ఈ విషయం తెలిసినప్పటినుండీ ఇంత బ్రతుకూ బ్రతికి ఎవరికో పుట్టిన అనాధ బిడ్డని తెచ్చి మనం పెంచుకోవడమా? మన రక్తం, వంశం, ఇంటిపేరు ఏంగాను? అందుకే నువు రెండో పెళ్ళి చేసుకోరా అని మా అమ్మ పోరు పెడుతోంది. నువ్వంటే నాకు చాలా ఇష్టం. అందుకే కట్నం తక్కువయినా నిన్ను కావాలని మరీ పెళ్ళి చేసుకున్నాను. కానీ ఇప్పటికే నాలుగేళ్ళయింది. మనకు పిల్లలు కలగలేదు. ఇక నీవల్ల పిల్లలు పుట్టరని తెలిసిపోయింది. కాబట్టి నువు కాస్త పెద్దమనసు చేసుకుని నేను మరో పెళ్ళి చేసుకోవడానికి నీ అభ్యంతరం లేదని చిన్న పేపర్లో రాసి నీ సంతకం పెడితే, నేను పిల్లల కోసం ఎవరో వొకర్ని చూసి పెళ్ళి చేసుకుంటాను. దేవుడు దయతలచి ఇద్దరు పిల్లలు పుడితే అంతేచాలు. నిన్ను నేను వదిలి పెట్టను. ఇక్కడే నువు వుండచ్చు. నీకేం తక్కువ కాకుండా నిన్ను బాగా చూసుకుంటాము" నచ్చచెబుతున్నట్లుగా ప్రేమగా మీద చేయి వేసాడు సురేష్. అతని చేయి తీసి ప్రక్కన పెట్టి నిద్రనటించింది సీత.

"సరే నీకు నిద్రవస్తున్నట్లుంది పడుకో ప్రొద్దున్నే మాట్లాడుకుందాం" అంటూ ప్రక్కనే పడుకున్నాడు సురేష్. ఏదో జంతువు వచ్చి తన ప్రక్కన పడుకున్నట్లుగా వళ్ళు జలదరించింది సీతకు. తప్పదు కాబట్టి అలాగే కదలకుండా ఒక ప్రక్కకు ఒదిగి పడుకుండిపోయింది.

ఇక అప్పటినుండీ ఇంట్లోని వారందరూ సీత ప్రక్కన చేరి సంతకం చేయమని ఒత్తిడి చేయసాగారు. వారి మాటలను భరిస్తూ ఆ అనకుండా ఉహూ అనకుండా మౌనంగా ఉండిపోయింది సీత. వారి మాటలూ ప్రవర్తనా ఆమెకేమీ తేడా అనిపించడంలేదు. నాలుగేళ్ళనుండీ వాళ్ళ మనస్థత్వాలు బాగా తెలిసి వుండటంతో ఇవన్నీ ముందే ఊహించినట్లుగా నిమ్మళంగా ఉండిపోయింది. కానీ ప్రతిరోజూ ఆమె చెవిలో ఇల్లుకట్టుకుని పోరుపెడుతున్నారు ముగ్గురూ. దీనికి తోడు అత్తగారు ఇరుగుపొరుగమ్మలకు పిల్లలు పుట్టకపోవడానికి కారణం మా కోడలే. తప్పంతా తనదే మా కొడుకుది ఏమాత్రం లేదు అని విషయాన్ని చెప్పినట్లున్నారు. ఈ మధ్య వారి తాకిడి ఎక్కువయిపోయింది.

"అయ్యో గొడ్రాలి జన్మ ఎంత పాపిష్టి జన్మకదా? నీ ఆడబ్రతుక్కి అర్ధమే లేకుండా పాయనే. మనిషివి చూస్తే చక్కగా వున్నావు. మోడైన చెట్టులా మిగిలిపోతివే" శూలాల్లాంటి సానుభూతి మాటలతో సీతను పొడిచేవారు. ఆడపడుచు కూడా ప్రతిరోజూ ఫోను చేసి పదినిముషాలు హితబోధ చేసేది.

ఇక ఆ ఇంట్లో బ్రతకడం ఎంతో దుర్లభం అనిపించింది. ఇలాంటి మనుషుల మధ్య ఏ విధంగా బ్రతకగలదు? ఎందుకో చాలా సిగ్గుగా అనిపించింది సీతకు. తనమీద తనకే జాలిగా అనిపించింది. వాళ్ళు కోరినట్లుగా ఆ పేపర్పై సంతకం చేసేసి పుట్టింటికి వెళ్ళి తలదాచుకుందాం అని నిర్ణయించుకుంది. కానీ అపుడే ఆమె ఊహించని సంఘటన జరిగింది. దాంతో ఆమె మానసికంగా షాక్కు గురయింది. ఆమెకు మనుషుల మీదే నమ్మకం పోయింది. అందువల్ల ఆమె వాళ్ళందరికీ బుద్ధి చెప్పాలని తనకు తగిన నిర్ణయాన్ని తీసుకుని అమలు పరిచింది. జరిగిన ఆ సంఘటన ఏంటంటే..

నాల్రోజుల తరువాత ప్రొద్దున్నే పదిగంటలప్పుడు సీత అమ్మా నాన్నలు తమ చిన్న కూతురైన గీతను వెంటబెట్టుకుని బస్ దిగారు. చెప్పా పెట్టకుండా సడన్గా వాళ్ళు రావడంతో కాస్త ఆశ్చర్యానికి, మరో విధంగా తమ వాళ్ళను చూసి ఆనందానికి లోనయింది సీత. వాళ్ళను చూడగానే తనలోని బాధ కాస్త తగ్గినట్లయింది సీతకు. ఆప్యాయంగా పలకరించింది. తన వేదనను వాళ్ళతో చెప్పుకుని ఊరట పొందాలని అనుకుంది సీత.

ఆ రోజు అత్తమామలు కూడా పొలం పనులకు వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయారు. అందరూ హాల్లో కూచుని సంతోషంగా మాట్లాడుకోసాగారు "అమ్మా సీతా నువు వంట చెయ్యి. మేము కూర్చుని కబుర్లు చెప్పుకుంటాం" అంటూ అత్తగారు ఆర్డర్ వెయ్యడంతో సీత వంటింట్లోకి వెళ్ళిపోయింది. సురేష్ కూడా నవ్వుకుంటూ వాళ్ళతో చేరిపోయాడు. తన అమ్మా నాన్నలు ఎప్పుడూ వచ్చినా ముఖం ముటముటలాడించే అత్తగారు ఈ రోజు సంతోషంగా నవ్వుతూ వాళ్ళతో కబుర్లు చెప్పడం సీతకు ఆశ్చర్యాన్ని కలిగించింది. డాక్టరు ఇచ్చిన రిపోర్ట్సు విషయం తెలిస్తే అమ్మా నాన్నలు ఎంతగా బాధపడతారో అని ఆలోచిస్తూ వంట చేయసాగింది సీత. ఈ లోపల వాళ్ళకు కాఫీలు పట్టుకొచ్చిన సీతకు సురేష్ గీత ప్రక్కన కూర్చుని పరాచికాలు ఆడుతూ కనిపించాడు.

"ఏంటే మరదలా ఈ మధ్య తెల్లబడ్డావే. ఏం సోపు వాడుతున్నావేంటి?" అంటూ బుగ్గ పట్టి లాగుతున్నాడు. బదులుగా అది "అక్కకు పిల్లలు పుట్టరటకదా అందుకే నిన్ను చేసుకోమని అమ్మా నాన్న చెపుతుంటే న్నాలోజుల్నుంచీ ఫెయిర్ అండ్ లవ్లీ ఫేస్ క్రీమ్ వాడుతున్నాను బావా" అంటూ మెలికలు తిరిగిపోతోంది చెల్లెలు గీత. ఇంతలో సీత నాన్నగారు కలగజేసుకుని "సురేష్‌కు గీతనిచ్చి పెళ్ళి చేస్తే అంతా ఒకచోటే వుంటారు చెల్లెమ్మా. మరలా పరాయి సంబంధం ఎందుకు? అన్నింటికీ ఇబ్బంది అవుతుంది" అంటున్నారు అతి వినయాన్ని ఒలకబోస్తూ అత్తగారితో. వాళ్ళ మాటలకి నిశ్చేష్టురాలయింది సీత. భూమి రెండుగా చీలితే అందులో తాను దిగబడిపోయి అక్కడ దాక్కోడం బాగుంటుంది అనిపించింది సీతకు.

మనుషులు తల్లిదండ్రులైనా, అక్క చెల్లెళ్ళైనా సరే ఎంత స్వార్ధంగా ఆలోచిస్తారో మానవ సంబంధాలు ఎంత స్వార్ధమైనవో అపుడే అర్ధమయింది సీతకు.

మధ్యాహ్నం భోజనాలు కాగానే అందరూ సీత చుట్టూ కూర్చున్నారు.

"నీకు పిల్లలు పుట్టకపోతే ఏమయిందే సీతా నువు బాధపడాల్సిన పనేలేదు. సురేష్‌కు మన గీతను ఇచ్చి పెళ్ళి చేస్తే పదినెలలు తిరిగేలోపల బిడ్డ పుడతాడు. మీరందరూ ఒకటే చోట వుంటారు. నువు కళ్ళు మూసుకుని ఒక్క సంతకం పెట్టు చాలు" అంటూ వూకుమ్మడిగా చెప్పసాగారు. సురేష్ అయితే ఏకంగా బెడ్‌రూమ్‌లో చేరి గీతతో సరసాలు కూడా మొదలుపెట్టాడు.

అదికూడా సిగ్గులేకుండా నవ్వుతూ బావప్రక్కనే అతుక్కుని కూచుంది. ఛీ.. ఈ మనుషులకు సిగ్గులేదా? నీతి లేదా? వీళ్ళకన్నా జంతువులు నయమేమో. ఆ క్షణాన జీవితం మీదే విరక్తి కలిగింది సీతకు. వాళ్ళందరి పోరు భరించలేక సరే, నాక్కొంచెం టైమివ్వండి. అలాగే చేద్దాం అంది సీత. దాంతో అందరి ముఖాల్లోకి ఆనందం పొక్కుంటూ వచ్చింది. అలాగే సీతా నువ్వు కాస్త టైమ్ తీసుకో. ఈలోపల మేము మంచి ముహూర్తాలు చూసుకుని పెళ్ళి ఏర్పాట్లు చేసుకుంటాం అన్నారు అమ్మానాన్నలు. ఎదిగిన రెండో కూతురు గీత చెప్పిన మాట వినకుండా చెడు స్నేహాలతో లోకం పోకడలతో గుండెల మీద కుంపటిలా మండుతుంటే దీన్నెలా వదిలించుకోవాలా అని ఆలోచిస్తున్నారు గీత తల్లిదండ్రులు. ఇదీ మానవత్వం, మనిషితత్వం అనుకుంటూ నిట్టూర్చింది సీత. అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది ఆమె. అది అమలులో పెట్టటమే మిగిలింది. అందుకే వాళ్ళని కాస్త టైమ్ అడిగింది ఆమె. అనుకున్నవన్నీ సక్రమంగా జరిగితే రెండు నెలల్లో పని ముగిసిపోతుంది.

తన స్నేహితురాలు క్లాస్‌మేట్ అయిన పద్మ భర్తతోపాటు కువైట్‌లో వుండి జాబ్ చేస్తోంది. వెంటనే ఇంట్లో వాళ్ళకు ఎవరికీ తెలియకుండా పద్మకు ఫోను చేసింది సీత. తొందరగా తనకు వీసా పంపించమని, ఇక ఇక్కడ వుండటం కుదరదనీ, ఇదొక నరకమనీ తన బాధను చెప్పుకుంది. "అయ్యో అలాగా బాధపడకు. అలాగే తొందరగా నువు పాస్‌పోర్టు తయారు చేయించుకుని కాపీలు పంపించు. నేను వీలయినంత తొందరగా నీకు వీసా తీసి పంపిస్తాను" అని భరోసా ఇచ్చింది పద్మ. దాంతో కాస్త ఊపిరి పీల్చుకుని కొంత ఊరట చెందింది సీత.

రెండు నెలల లోపలే పద్మ పంపించిన వీసా సీత చేతిలో కొచ్చింది. ఫ్లయిట్ టిక్కెట్లు, ప్రయాణపు పనులు చూడటానికి పద్మే ఒక ఏజంటును సంప్రదించి సీతకు సహాయం చెయ్యమంది. అన్ని ఖర్చులకు గానూ తన చేతిలో వున్న నాలుగు గాజులూ అమ్మేసి వచ్చిన డబ్బు ఆ ఏజంటు చేతికిచ్చింది సీత.

వారికందరికీ దూరంగా పరిగెత్తి పారిపోవాలనిపించింది. అమ్మా నాన్నలతో సహా ఎవరిముఖాలూ చూడాలనిపించలేదు సీతకు. వాళ్ళందరూ శత్రువుల్లా కనిపిస్తున్నారు.

కువైట్‌లో మామా బాబాకు ముగ్గురు చిన్న పిల్లలంట. వారి సంరక్షణ చూడటానికి ఒక మనిషి కావాలంటే పద్మకు తెలిసి వెంటనే ఆ వీసా తీసి సీతకు పంపించింది. తన కడుపున పిల్లలు పుట్టకపోయినా కనీసం పరాయి పిల్లల్ని సంరక్షించడం కోసం కువైట్ వెళ్ళడం ఎంతో సంతోషంగా అనిపించింది సీతకు. ప్రేమను పంచడానికి కడుపునే పుట్టాలా ఎవరి పిల్లలయితేనేం, పిల్లలంతా దేవుని స్వరూపాలేకదా అని తృప్తి పడింది సీత. తరువాత రోజుల్లో ఊర్లోని వారిద్వారా తెలిసిందేమిటంటే, సీత సంతకం పెట్టకపోయినా చెల్లి గీతను సురేష్ పెళ్ళి చేసుకున్నాడు. సీత పోతే పోయిందిలే ఎక్కడికి పోతుంది. కువైట్ నుండి తిరిగి వస్తుంది. సంపాదించిన డబ్బంతా ఇంటికే పంపిస్తుంది అంతా మనమంచికే అనుకున్నారు వాళ్ళు. కానీ సీత రెండేళ్ళు దాటినా వారితో మాట్లాడలేదు. ఒక్క రూపాయి కూడా వాళ్ళకు పంపించలేదు. వాళ్ళు సీతతో మాట్లాడాలని ప్రయత్నించినా ఆమె విముఖత చూపించింది. ముఖ్యమైన విషయం ఏంటంటే ఇప్పటికి రెండేళ్ళు గడిచినా గీతకు కూడా ఇంకా పిల్లలు పుట్టలేదంట. మరి వాళ్ళు ఇప్పుడేం చేస్తారో

- అంటూ సుదీర్ఘమైన తన కథను ముగించింది సీత.

కథ విన్న మామా "అయ్యో అలాగా నీకేం ఫరవాలేదు. నువు ఇక్కడే మా దగ్గరే వుండు. నీకు ఇష్టమొచ్చినప్పుడే ఇండియాకు వెళ్ళచ్చు. నీకేం కావాలన్నా నన్ను అడుగు నీకే కొరతలేకుండా మేము చూసుకుంటాము ఎవరూ లేరని దిగులు పడకు నువు కూడా మా యింట్లో మనిషివే. నువ్వింకా చిన్న వయసులోనే ఉన్నావు ఇలా వంటరిగా ఎలా బతుకుతావు. నిన్ను నేను డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను. మంచి అబ్బాయిని చూసి పెళ్ళిచేసుకోవాలి. తప్పకుండా నీకు పిల్లలు పుడతారు. ఇలా ఎండిన మోడులా ఎందుకు మిగిలిపోవాలి? నీ జీవితం మళ్ళీ చిగురించాలి. అందుకు సహాయం నేను చేస్తాను." అంది మామా సీతకు ధైర్యం చెబుతూ.

కారణాలు ఏవైతేనేం ఎందరో స్త్రీలు స్వదేశాన్ని తమవారిని విడిచి పరాయి దేశం వెళ్ళి ఏళ్ళకు ఏళ్ళు అక్కడ గడుపుతున్నారు. సీతలాంటి స్త్రీలు గల్ఫ్ దేశాల్లో మరెందరో వున్నారు. పరాయి దేశంలో పనిమనుషుల్లా కాలం గడిపే వారి వెనుక ఎన్నో కథలూ వున్నాయి.

Post your comments

*( మరోకథ వచ్చేనెలలో)*